
మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 188 | బుధవారం, 10 జూన్ 2026 | పేజీలు : 4



# కమలదళం కకావికలం

## జనగామ బీజేపీలో అంతర్గత విభేదాలు

జనగామ బీజేపీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయని తెలుస్తోంది. దీంతో జనగామ జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం కీలకమైన మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అంతర్గత విభేదాలతో కొందరు సీనియర్ నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు తమ దిశను మార్చుకుని అడుగులు వేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

సీనియర్లను పట్టించుకోని జిల్లా అధ్యక్షుడు

జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేసేందుకు రెడీ!

జనగామలో మారుతున్న రాజకీయ సమీకరణలు

3



# మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన్రు

- పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు
- అబద్దాల వార్తలకు కేరాఫ్ హరీశ్‌రావు
- మాది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం
- త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా
- రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాం
- రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశాం..
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ. 60 కోట్లతో విద్యుత్ పనులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్టలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి



# ప్రతి ఓటరు మనకు ముఖ్యమే..

- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- బూత్ లెవల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం

# 1వ తేదీన జీతాలు ఇవ్వాలి

- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాలనర్సయ్య

3





# రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన్రు

(మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్టలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు.

## రాష్ట్రాన్ని దోపిడీ చేశారు!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్ల రూపాయలను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోంది. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ. 76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లం" అని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సొమ్మంతా గత పాలకుల ఇళ్లకే పోయిందని, అందుకే పదేళ్లలో పేదలకు సన్నబియ్యం గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు.

## డిస్కంలను ముంచేసింది మీరు కాదా?

పదేళ్ల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప, డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పులపాలు చేశారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. "మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బంది పడ్డాయి. కానీ, మా ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ. 14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ. 5 వేల కోట్లను మొత్తంగా రూ. 19 వేల కోట్లను ప్రతి నెల ఆర్థిక శాఖ ద్వారా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నాం. దీనిపై కూడా అభాండాలు వేయడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనం" అని స్పష్టం చేశారు.

## అబద్ధాల హరీశ్!

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మా క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే.. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం

- పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు
- అబద్ధాల వార్తలకు కేరాఫ్ హరీశ్‌రావు
- మాది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం
- త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల ఉచిత బీమా
- రాష్ట్రంలో ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ
- రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ. 60 కోట్లతో విద్యుత్ పనులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారు. గాలి కబుర్లు పోగేసి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారు. అధికారం పోయిందనే తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారు" అని హరీష్ రావుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైతులను ముంచిన బీజేపీ!

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. "మద్దతు ధర (MSP) ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్ సి ఐ (FCI) ద్వారా ఎందుకు సేకరించడం లేదు? గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే కొనుగోలు చేసేది. ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు?" అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రం కొన్నా, కొనకపోయినా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మద్దతు ధరతో మొక్కజొన్నలు కొంటున్నారా అని ప్రశ్నించిన ఆయన, కేవలం తెలంగాణలోనే మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

## ఏం ముఖం పెట్టుకుని వస్తున్నారు?

రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే.. 'తగుదునమ్మా' అంటూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు? వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర మా కాంగ్రెస్ ప్రభుత్వానిది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ. 22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

## పేదల గృహనిర్మాణానికి పెద్దపీట

గత ప్రభుత్వం 'డబుల్ బెడ్‌రూమ్' పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, తొలి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లే లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

మహిళా సాధికారతకు అండ

మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ. 67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ. 1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే, వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు.


## స్థానిక సమస్యలపై స్పందన

సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్ స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యసాధ్యాల పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్‌ప్లాన్ నిధులు పెద్ద ఎత్తున వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి యశస్విని రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, తదితరులు పాల్గొన్నారు.









## మహిళలకు రుణాల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 107 స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాల కింద రూ. 3,07,00,000, అలాగే బ్యాంకు లింకేజ్ కింద 407 స్వయం సహాయక సంఘాల రూ. 32,89,96,000 రుణాలను అందజేశారు. ఈ మేరకు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క్ చేతుల మీదుగా సంబంధిత చెక్కులను మహిళలకు అందజేశారు.



# కమలదళం కకావికలం

## జనగామ బీజేపీలో అంతర్గత విభేదాలు

జనగామ బీజేపీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయని తెలుస్తోంది. దీంతో జనగామ జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం కీలకమైన మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అంతర్గత విభేదాలతో కొందరు సీనియర్ నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు తమ దిశను మార్చుకుని అడుగులు వేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

- సీనియర్లను పట్టించుకోని జిల్లా అధ్యక్షుడు
- జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేసేందుకు రెడీ!
- జనగామలో మారుతున్న రాజకీయ సమీకరణలు

### ఒక్కొక్కరు ఒక్కో వైపు..


పట్టణానికి చెందిన సౌడ రమేశ్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జనగామలో పార్టీ మరింత అధ్వానంగా తయారైందని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. పార్టీ హైకమాండ్ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సైతం సరిగా చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నారు. అసలు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకునే ఆలోచనే జిల్లా సారథికి లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీని ఫలితంగానే ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయిందని బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో నాయకత్వంపై అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇక ఆయన నిర్ణయాల్లో ఎవరి భాగస్వామ్యం లేకపోవడం, ద్వితీయ శ్రేణి నాయకులకు సరైన గుర్తింపు లభించకపోవడంతో ఇందుకు ఒక కారణం కావొచ్చు. అలా సారథి తీరుకు విసిగిపోయిన నాయకులు పక్క చూపులు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో కొందరు నాయకులు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వైపు వెళ్లాలని భావిస్తుండగా, మరి కొందరు బీఆరెఎస్ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారని తెలిసింది. ఇక మరి కొందరు కాంగ్రెస్ యువ



నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డితో పనిచేసేందుకు ఇటీవల కలిసి మాట్లాడుకున్నారని సమాచారం. మొత్తానికి కమలనాథులు ఎటో ఒకవైపు 'షిఫ్టింగ్ అలైన్‌మెంట్'తో ఉన్నరని తెలుస్తోంది. అయితే వీరందరు త్వరలో జరగనున్న సమావేశంలో ఏకాభిప్రాయంతో ఒకే తాటిపైకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

### జాతీయ అధ్యక్షుడి రాక ముందు..

ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ తెలంగాణ పర్యటించనున్నారు. ఈ క్రమంలో యాదాద్రి జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన పాల్గొనున్నట్టు తెలిసింది. జాతీయ నేత పర్యటనకు ముందు జిల్లా స్థాయిలో ఉన్న ఈ విభేదాలు పార్టీ జిల్లా అధ్యక్షుడికి ఒక సవాలుగా మారాయి. జాతీయ నాయకత్వం దృష్టికి ఇక్కడి ఈ సమస్యలు తీసుకువెళ్ళాలని కొంతమంది నాయకులు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. అయితే జిల్లా సమస్యలపై గతంలో రాష్ట్ర నాయకత్వానికి పలు మార్లు వివరించినా వారు పట్టించుకోకపోవడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. మొత్తానికి జనగామ జిల్లా బీజేపీ ప్రస్తుతం ఒక కీలక మలుపులో ఉంది. కకావికలం అవుతున్న పార్టీ హైకమాండ్ ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి మరి..!



# ప్రతి ఓటు కాంగ్రెస్ పార్టీకి ముఖ్యం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- బూత్ లెవల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, ఓటరు జాబితాల పటిష్ట నిర్వహణ లక్ష్యంగా జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఓటు పార్టీకి ఎంతో ముఖ్యమని, ఓటరు జాబితాల నిర్వహణలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమర్థత కోసం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, బీఎల్ఏల శిక్షకుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం, ఓటరు నమోదు, ఓటరు జాబితాల సవరణలు, ఎన్నికల నిర్వహణలో బీఎల్ఏల బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడపాంచి బాలమణి శ్రీనివాస్, కౌన్సిలర్లు లోకమంత్ రెడ్డి, చెంచారపు కరుణాకర్ రెడ్డి, అనిత, సుమలత, రజిని, సర్పంచులు మల్లేష్, సత్యనారాయణ రెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.




# ఒకటో తేదీన జీతాలు వేయాలి

– మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్
– సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాలనర్సయ్య

**చేర్యాల, మన చౌరాస్తా:** గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాలనర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల మండల కేంద్రంలో మల్లిగారి బాలనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులందరినీ శాశ్వతీకరించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, వృద్ధాప్యం, అనారోగ్యం లేదా మరణం కారణంగా విధులు నిర్వర్తించలేని కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. ప్రమాదాల్లో మరణించిన సిబ్బంది కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మరణించిన కార్మికుల అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో పొట్టి కుమార్, గంగి బాలకిషన్, దర్శనం శంకరయ్య, తిమ్మాయిపల్లి కనకయ్య, రాజు, యాదగిరి, మల్లయ్య, వెంకటమ్మ, దాసరి కిషన్, పెద్దింటి లక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో
# రేణుకుంట్ల మురళికి ఘన సత్కారం

**జనగామ, మన చౌరాస్తా :** ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో చైతన్య సరస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీల్లో నిర్వహించిన ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత రేణుకుంట్ల మురళి ఘన సత్కారం అందుకున్నారు. విశ్వంభర సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, అంతర్జాతీయ ఆంగ్ల కవిగా, తెలుగు కవి, రచయిత, గాయకుడిగా గుర్తింపు పొందిన రేణుకుంట్ల మురళి మహాసభల్లో పాల్గొని “కుల వివక్షత” అంశంపై కవితా గానం చేసి సభికుల ప్రశంసలు అందుకున్నారు. తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతిక వైభవాన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తూ సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా నిర్వాహకులు ఆయనను జ్ఞాపిక, శాలువా, పూలమాలతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేణుకుంట్ల మురళి మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు వేలకుపైగా ప్రశంసాపత్రాలు, అనేక అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. సాహిత్య సేవకు లభిస్తున్న ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు, సీనియర్ నాయకుడు జ్యోతుల నెహ్రూ, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ కన్వీనర్ డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ సోము తదితరులు హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రెండువేల మందికిపైగా కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.



# యంగ్ ఇండియా స్కూల్ కోసం వినతి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాదులోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డిని నాగరత్న సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ఆధ్వర్యంలో మంగళవారం నాడు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో జనగామకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు కావడానికి తన వంతు సహకారం అందించినందుకుగాను చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రతిసారి ఏదో ఒక విద్యాసంస్థను సాధించుకోవాలనే తపనతో తన వద్దకు వస్తున్న బిర్రు ఇస్తారిని అభినందిస్తూ జనగామ ప్రాంతానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేసే విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇస్తారి మాట్లాడుతూ జనగామలో ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్ స్థాపనకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు రావడం వల్ల నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే భారం తప్పుతుందని పేర్కొంటూ, వీటిని త్వరగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# ఎల్లమ్మ గుడిలో అధిక జేష్ఠ మాసం పూజలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో ఉన్న బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ గుడిలో అధిక జేష్ఠ మాసంను పురస్కరించుకొని మహిళలు కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి మారుపాక శ్యాం ప్రసాద్, లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, లోనే మంజుల, దోసపాటి శ్రీలక్ష్మి, పోగుల కవిత,యనగందుల రేణుక, అయిత రమాదేవి, బొడ్డు లక్ష్మి, రాంపురం అనిత, కొలనుపాక సునీత, అయిత కళావతి, వేమల్ల సువర్ణ, బండోజు సరళ, సంబోజు జ్యోతి, భార్గవి పాల్గొన్నారు.






Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**